క్లుప్తంగా

‘చిత్ర’మే అతనికి జీవనోపాధి



చిత్రం గీస్తున్న శేఖర్

ధారూరు: ఏ జీవిని చూపెట్టినా నిమిషాల్లో చిత్రంగా మార్చి చేతుల్లో పెట్టే ఇతనికి.. ఆ కళే జీవనోపాధిగా మారింది. కోట్‌పల్లి ప్రాజెక్టుకు శని, ఆదివారాలు వచ్చే పర్యాటకులకు చిత్రాలు గీస్తూ ఔరా అనిపిస్తున్న ఆ కళాకారుడి పేరు శేఖర్. స్వగ్రామం జిల్లాలోని పూడూర్ మండల కేంద్రం. ఇతను హైదరాబాద్‌లోని ఫైన్‌ఆర్ట్స్ కళాశాలలో బీఎఫ్‌ఏ కోర్సు చేశాడు. ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులు శేఖర్.. తన చేతితో తమ చిత్రాన్ని చిత్రీకరిస్తారని తెలుసుకొని బొమ్మలు గీయించుకుంటారు. కాకపోతే అతని ముందు అరగంట పాటు ఓపికతో కూర్చుంటే ముఖ కవళికలను గుర్తించి చిత్రాన్ని పూర్తి చేస్తారు. మంచి నైపుణ్యంతో బొమ్మ వేయడం అతని ప్రతిభకు నిదర్శమని పర్యాటకులు పేర్కొన్నారు.

చీరలే.. పంటకు రక్షణ



పల్లి పంటకు రక్షణగా చీరలు

బొంరాస్‌పేట: వెరుశనగ పంటను రక్షించుకోవడానికి కర్షకులకు కోకలే ఆయుధాలుగా మారాయి. అడవి పందులు, ఇతర పంట నాశనం సమస్యలనుంచి జాగరణ, మందులు, ఎలక్ట్రిక్ యంత్రాల కన్నా.. చీరలే బాగా పని చేస్తున్నాయని రైతులు చెప్పుకుంటున్నారు. చౌకగా, ఉపయోగకరంగా ఉండటంతో పంట చుట్టూ చీరలనే చుట్టేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న సర్పంచు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని చెంగోల్ సర్పంచు మల్లీశ్వరిగౌడ్ అన్నారు. సోమవారం 1వ వార్డులో మోటర్ బిగించి తాగునీటి సమస్య పరిష్కరించి మాట్లాడారు. పంచాయతీ నిధులతో గ్రామ సమస్యలు పరిష్కరిస్తున్నానని చెప్పారు. త్వరలో ఎమ్మెల్యే నిధులు రూ.50 లక్షలు గ్రామానికి వస్తాయని, దీంతో సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పరిగి: ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



తాండూరు టౌన్: భద్రప్పఆలయ శివాలయంలో..



దోమ: మైలారం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో..

వైకుంఠ ఏకాదశి వైభోగం

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణాలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. దేవాలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. పవిత్ర పర్వదినం కావడంతో దేవతామూర్తుల దర్శనం కోసం భక్తులు వేకువ జామునుంచే ఆలయాలకు బారులు తీరారు. పరిగి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, తాండూరు చంద్రగిరిలోని శ్రీదేవి భూదేవి తదితర దేవాలయాల్లో స్వామివారి దర్శనార్థం ఉత్తరద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు భారీ సంఖ్యలో స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



తాండూరు రూరల్: దస్తగిరిపేట్‌లో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర ఆలయం వద్ద భక్తుల సందడి



దోమ: ఉత్తర ద్వార దర్శనం కోసం..



కుల్కచర్ల: మరికల్ రాములవారి సన్నిధిలో..



పరిగి: ఆలయంలో భక్తులు

పల్లెల్లో తాగునీటి ఎద్దడి

- వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరి‘జనం’

ధారూరు: మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు రెండు రోజుల నుంచి నిలిచిపోవడంతో.. ప్రత్యామ్నాయం లేక గిరిజనులు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. గతంలో ట్యాంకుల ద్వారా సరఫరా చేసేవారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో తాగునీటి సరఫరా ఉండేది. ప్రస్తుతం మిషన్ భగీరథతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రెడు రోజుల నుంచి సరఫరా లేక.. లక్ష్మీనగర్‌తండా వాసులు వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. పశువులు, మేకలు, గొర్రెలను అక్కడికే తీసుకెళ్లి వాటి దాహాన్ని తీరుస్తున్నారు. ఇందుకోసం కుటుంబంలోని ఒకరు రోజంతా పని వదులుకొని.. తాగునీటి కోసం శ్రమిస్తున్నారు. ఇది ఒక లక్ష్మీనగర్‌తండాకే పరిమితం కాలేదు. ధారూరు మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పలు గ్రామాలు, తండాల్లో బోరుమోటార్లు పనిచేయకపోవడంతో తాగు, ఇతర అవసరాల కోసం అల్లాడిపోతున్నారు. మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరా ఆగిపోతే ప్రత్యామ్నాయంగా ఇంతకు ముందున్న బోరుబావులను సరిచేసి వాడుకలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.



బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

అక్రమ కేసులకు భయపడేది లేదు



యాలాల: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు

యాలాల: మండలంలో పార్టీ ఎదుగుదల చూసి ఓర్వలేకే అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకులు తమపై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినప్పటికీ అక్రమకేసులకు భయపడేది లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, మండల అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడారు. ఇటీవల కోకట్‌లో పార్టీ నిర్వహించిన కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ పాల్గొన్నారని, ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరారని చెప్పారు. ఆ కార్యక్రమంలో ఎవరినీ కించపరిచే విధంగా మాట్లాడనప్పటికీ.. కొందరూ బీఆర్ఎస్ నాయకులు మురళీకృష్ణపై అట్రాసిటి కేసు పెట్టించారని ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మండలంలో ఇలాంటి దిగజారుడు రాజకీయాలు, కక్షసాధింపు చర్యలు ఎప్పుడూ తాను చూడలేదని హన్మంతు వాపోయారు. బీసీ,ఎస్సీల మధ్య కావాలనే చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజిలయ్య, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, లాలప్ప, పకీరప్ప తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ అనుచరులే లబ్ధి

తాండూరు టౌన్: బీజేపీ నేత మురళీకృష్ణగౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం అన్యాయమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. దళితబంధు పథకం ద్వారా అర్హులైన దళితులకు కాకుండా బీఆర్ఎస్ అనుచరులకే లబ్ధి చేస్తున్నారనే విషయంపై మాట్లాడిన మాజీ గ్రంథాలయ చైర్మన్, బీజేపీ నేత మురళీకృష్ణ గౌడ్‌పై కేసు పెట్టడం నీతిమాలిన చర్య అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం మాట్లాడిన ఆయన మాటలను బీఆర్ఎస్ నాయకులు కుట్రపూరితంగా వక్రీకరించి కేసు పెట్టించారన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, అర్హులైన దళితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.

సంఘాన్ని మరింత బలోపేతం చేస్తాం

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్



కమిటీ ప్రతినిధులతో శివకుమార్ తదితరులు

అనంతగిరి: జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఈమేరకు సోమవారం ఆయన నూతన జిల్లా కార్యవర్గంతో హైదరాబాద్‌లో టీఎన్‌జీవో సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌లను మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. సంస్థ బలోపేతానికి చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి బుచ్చిరెడ్డి, జిల్లా కార్యదర్శి అంజత్‌పాషా, నర్సింహులు, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

‘బలమైన సంఘం పీఆర్‌టీయూ’

మోమిన్‌పేట: రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ సంఘాల్లో బలమైన సంఘం పీఆర్‌టీయూ అని సంఘం మండల శాఖ అధ్యక్షుడు మల్లేశం అన్నారు. సోమవారం మండల పరిషత్ ఆవరణలో నూతన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ సంఘం ముందుంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, మండలశాఖ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, రాష్ట్ర బాధ్యులు వేణుగోపాల్, మల్లయ్య, అంజయ్య, గౌరవ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మధుకర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గౌరిశంకర్, మల్లేశం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మునీర్ అహ్మద్, సంతోష్‌కుమార్, మల్లయ్య, జిల్లా నాయకులు దండు రమేశ్, ప్రభాకర్, గోవర్ధన్, రవికుమార్, జ్యోతి, కవిత, అఖిల, మండల బాధ్యులు శంకర్‌నాయక్, రాఘవేందర్‌గౌడు, గాండ్ల రఘు తదితరులు ఉన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

బషీరాబాద్: సర్పంచ్ ప్రియాంక, బీఆర్ఎస్ నేత శ్రావణ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో మండలంలోని అయ్యప్ప మాలధారులకు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బషీరాబాద్, కొర్విచెడ్, నవల్గ, ఎక్మాయి నుంచి అయ్యప్ప భక్తులు భారీగా తరలి వచ్చారు.

సమస్యలు త్వరగా పరిష్కరిస్తా



కేక్ కట్‌చేస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే డయల్ యువర్ కార్యక్రమమని చైర్‌పర్సన్ మంజుల అన్నారు. ఈ మేరకు సోమవారం చేపట్టిన డయల్ యువర్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టణ ప్రజల నుంచి 24 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత విభాగం అధికారులతో మాట్లాడి సమస్యలు పర్కిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా డ్రైనేజీ, రోడ్ల మరమ్మతుపై ఫిర్యాదులు వచ్చినట్లు చైర్‌పర్సన్ వెల్లడించారు.

న్యూఇయర్ వేడుకలు

రెండేళ్లుగా కరోనాతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న పట్టణ ప్రజలకు.. నూతన సంవత్సరం అన్ని విధాలుగా కలిసి రావాలని చైర్‌పర్సన్ ఆకాంక్షించారు. ఈ మేరకు కౌన్సిలర్లు గాయిత్రి లక్ష్మణ్ గుప్తా, మొముల స్వాతి, అనంతలక్ష్మి, చందర్ నాయక్, రాములు, మురళీ, దేవి, మున్సిపల్ అధికారులతో కలిసి ఆమె.. మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా

యాలాల: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ‘తొలిమెట్టు’ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో టీఎల్ఎం మేళాను ప్రారంభించి మాట్లాడారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా మండలం నుంచి 21 పాఠశాలలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యాలయాల్లో మరమ్మతులు, కరెంటు సౌకర్యం, మరుగుదొడ్లు, తాగునీటి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు.. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు వినియోగించే టీఎల్ఎం ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన సులభతరమైన పద్ధతులు, టెక్నిక్‌లు బోధనకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయని అభినందించారు. కాగా ఇటీవల నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ నర్స్యానాయక్, జీహెచ్ఎంలు పార్వతీదేవి, మహిపాల్‌రెడ్డి, వెంకటస్వామి, ఉపాధ్యాయ సంఘ బాధ్యుడు శ్రీధర్‌రెడ్డి, వీరేశం, ఎస్ఎంసీ చైర్మన్ సాయిలు, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.



టీఎల్ఎం మేళాలో బోధనా పద్ధతులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ తదితరులు

నిధులు మళ్లిస్తే అభివృద్ధి ఎట్లా?

- సర్పంచు హక్కులను కాలరాస్తున్న సీఎం కేసీఆర్
- గ్రామాలాభివృద్ధికి సహకరించని రాష్ట్ర ప్రభుత్వం
- జీపీల నిధులు మళ్లించడంపై కాంగ్రెస్ నేతల మండిపాటు
- పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నారంటూ ధ్వజం
- నిరసనకు వెళ్తున్న నాయకుల అరెస్ట్



పరిగి: హైదరాబాద్ రాంగోపాల్‌పేట్ పీఎస్‌లో కాంగ్రెస్ నాయకులు

తాండూరు టౌన్: ‘గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించకుండా.. ఉన్న డబ్బును మళ్లిస్తే జీపీలు ఎలా అభివృద్ధి చెందుతాయి. సర్పంచుల హక్కులను కాలరాస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు హేయమైనవి’ అని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. జీపీల నిధులపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా.. పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ధర్నాకు వెళ్లకుండా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ.. ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికమని పలువురు నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్, యూత్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు బంటు వేణుగోపాల్ మాట్లాడారు. నిరంకుశ విధానంపై నిరసన వ్యక్తం చేయకుండా అరెస్టులతో అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. అరెస్టయిన వారిలో వెంకటయ్య, భీమ్‌శంకర్ ఉన్నారు.

నిధులు మళ్లించడం సమంజసం కాదు..

దౌల్తాబాద్: సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి.. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం వాటిని మళ్లించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, నాయకులు వెంకట్రాములు, రాజు, దస్తప్ప, సత్యపాల్, హన్మంతు, మహిపాల్ తదితరులున్నారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

కుల్కచర్ల: నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సర్పంచుల నిధులను ప్రభుత్వం తీసుకోవడం పట్ల నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ.. నాయకులు మాట్లాడారు. శాంతియుతంగా ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని తాము భావించామని, కానీ ప్రభుత్వం దురుద్దేశంతో అరెస్టులు చేయించడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్య, ఎంపీటీసీ ఆనందం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జీలు భాస్కర్, శ్రీనివాస్, నాయకులు జలీల్, సోమలింగం, వెంకటేశ్, కృష్ణయ్య, ఎల్లయ్య, ఘనాపూర్ శ్రీనివాస్, జంగయ్య, అంజి ఉన్నారు.

అప్రజాస్వామికం..

దోమ: పోలీసుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సర్పంచుల తీరు దయనీయంగా మారిందని, సీఎం కేసీఆర్ సర్పంచులను అప్పుల ఊబిలోకి లాగుతున్నారని ఆరోపించారు. జీపీల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేస్తే.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో నేతలు రామన్న మాదిగ, జాకటి వెంకటయ్య పాల్గొన్నారు.

జీపీ నిధులు జమచేయాలి

పరిగి: కేంద్రం గ్రామపంచాయతీలకు విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జమ చేయాలని డీసీసీ అధ్యక్షుడు హన్మంతుముదిరాజ్ డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల డబ్బులు జీపీలో జమ చేయాలని పార్టీ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి పరిగి నియోకవర్గం నుంచి వెళ్లిన నాయకులను నగరంలో పోలీసులు అరెస్టు చేసి రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో గండీడ్ మండల అధ్యక్షుడు నారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్‌నాయక్, నాగవర్ధన్ రాజపుల్లారెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వం

మోమిన్‌పేట: జీపీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఆరోపించారు. పార్టీ పిలుపు మేరకు 15వ ఆర్థికసంఘం నిధులను దారి మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాకు సిద్ధమైన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. దీనికి నిరసనగా శంకర్ మాట్లాడారు. సర్పంచులకు తెలియకుండా జీపీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వం .. ఏం చేయాలో తెలియని స్థితికి దిగజారిందని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు మహ్మద్ హాజీ, నాయకులు మాణయ్య, సిరాజోద్దీన్, అస్లం, సిజావోద్దీన్, మల్లేశ్‌గౌడ్, పర్మారెడ్డి, ఎజాస్ తదితరులు ఉన్నారు.



తాండూరు టౌన్: పోలీసుల అదుపులో కాంగ్రెస్ నేతలు



దౌల్తాబాద్‌లో..



కుల్కచర్ల: పోలీసుల అదుపులో కాంగ్రెస్ శ్రేణులు



మోమిన్‌పేట: పోలీస్‌స్టేషన్‌లో..



కొడంగల్ రూరల్: పోలీస్‌స్టేషన్ ఆవరణలో..



దోమ: పోలీస్‌స్టేషన్‌లో..